న్యూస్‌రీల్

నేడు జాబ్‌మేళా

పరిగి: పట్టణంలోని నంబర్ వన్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మహిళల కోసం ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫాక్స్‌కాన్ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరుగుతుందని పదో తరగతి పాస్, ఫెయిల్ అయిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజావాణి అర్జీలను సత్వరం పరిష్కరించాలి

కలెక్టర్ ప్రతీక్‌జైన్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన అర్జీలను పెండింగ్‌లో ఉంచరాదని, సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యలపై అర్జీలు ఇచ్చారు. మొత్తం 99 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, ఆర్‌డీఓ వాసుచంద్ర, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పాంబండ హుండీ ఆదాయం రూ.2,87,591



టెంకాయల విక్రయానికి వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

కుల్కచర్ల: పాంబండ ఆలయ అభివృద్ధికి అందరి సహకారంతో ముందుకు సాగుతామని ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి, ఈఓ బాలనర్సయ్య అన్నారు. సోమవారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. అనంతరం టెంకాయల విక్రయానికి వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులు హుండీలో సమర్పించిన నగదును సోమవారం లెక్కించారు. రూ.2,87,591 ఆదాయం సమకూరిందని అధికారులు పేర్కొన్నారు. అనంతరం టెంకాయలు విక్రయించడానికి వేలం నిర్వహించగా కాకర్లపాడు వెంకటయ్య రూ.6.92లక్షలకు హక్కులు పొందారు. అలాగే చిన్నజాతరను మినహాయించి సంవత్సర కాలం పాటు టెంకాయలు, ప్రసాదం విక్రయించడానికి శివప్రసాద్ అనే వ్యక్తి రూ.9లక్షల 4వేలకు పాట దక్కించుకున్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, ఆలయ పూజారి పాండు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తర్వాతే..

ఉద్యోగ నియామకాలు చేపట్టాలి



దీక్షలో కూర్చున్న ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

అనంతగిరి: ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ ముగిసిన తర్వాతే గ్రూప్ -1, 2, 3 ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎంఎస్‌పీ(మహాజన సోషలిస్టు పార్టీ) జిల్లా అధ్యక్షుడు ఆనంద్, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ డిమాండ్ చేశారు. వర్గీకరణ ప్రక్రియ పూర్తి చేయకుండానే ఉద్యోగ నియామకాలు చేపట్టడం సరికాదన్నారు. మాదిగల జీవితాలతో చెలగాటం ఆడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఖరికి నిరసనగా సోమవారం వికారాబాద్‌లోని ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట దీక్షను చేపట్టినట్లు తెలిపారు. ఈ దీక్షను దళిత సంఘాల జిల్లా నాయకుడు జగదీష్ ప్రారంభించారు. నాయకులు శివాజీ, జగన్, భారత్, శ్రీశైలం, శ్రీనివాస్, రాజు, జగదీష్, మధు, అనిల్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు

తాండూరు రూరల్: మండలంలోని దివ్యాంగులకు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై రుణం అందజేయనున్నట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వంద శాతం వైకల్యం ఉన్న ఒక వ్యక్తి పేరుతోపాటు 90 శాతం వైకల్యం ఉన్న ముగ్గురి పేర్ల జాబితాను జిల్లా ఉన్నతాధికారులకు పంపామని తెలిపారు.

‘పీఎం విశ్వకర్మ’ను పక్కాగా అమలు చేయాలి

- పథకంపై అవగాహన కల్పించండి
- అడిషనల్ కలెక్టర్ సుధీర్




అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

అనంతగిరి: సంప్రదాయ చేతివృత్తుల వారి ఆర్థిక పురోగతికి పీఎం విశ్వకర్మ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అడిషనల్ కలెక్టర్ సుధీర్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పథకం అమలు, పురోగతిపై వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వకర్మ వృత్తులపై ఆధారపడిన కుటుంబాలు ఆర్థికంగా ఎదగడానికి అధికారులు తోడ్పాటు నందించాలన్నారు. కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, కంసాలి, చాకలి, మంగలి, ఉప్పరి తదితర 18 రకాల చేతి వృత్తుల వారికి లబ్ధి చేకూరేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పథకంపై అవగాహన కల్పించాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. వివిధ వృత్తుల్లో శిక్షణ పొందేలా ప్రోత్సహించాలని అన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ మహేశ్వర్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, డీబీసీడీఓ ఉపేందర్, మెప్మా పీడీ రవికుమార్, మున్సిపల్ కమిషనర్లు జాకీర్ అహ్మద్, వెంకటయ్య, ఎస్సీ కార్పొరేషన్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



నేత్రపర్వం.. రథోత్సవం

నవాబుపేట మండలం ఎల్లకొండ శివాలయం సోమవారం శివనామ స్మరణతో మార్మోగింది. ఉత్సవాల్లో భాగంగా పార్వతీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున కుంకుమార్చన, అభిషేకం, హారతి, మంత్ర పుష్పం తదితర పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించిన రథంపైకి చేర్చారు. వందలాది మంది భక్తుల కోలాహలం మధ్య రథం ముందుకు సాగింది. ప్రజలు నీటి మొక్కులు తీర్చుకున్నారు. వేడుకల్లో ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఆలయ కమిటీ చైర్మన్ భరత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు సుదర్శన్, గోపాల్, మాణిక్‌రెడ్డి, లింగం, ప్రభాకర్‌రెడ్డి, ప్రకాశం పంతులు, శ్రీపాల్ పంతులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

– నవాబుపేట

అంగట్లో పర్మిట్లు!

సీఎం సొంత జిల్లాలో జోరుగా ఇసుక దందా

- పూర్తయిన రోడ్డుకు ఇసుక పర్మిషన్ ఇచ్చిన రెవెన్యూ అధికారులు
- 5 ట్రాక్టర్లతో 30 ట్రిప్పులకు అనుమతి
- మంబాపూర్ సమీపంలో డంపింగ్ చేసిన అక్రమార్కులు
- తప్పుడు ప్రొసీడింగ్‌లతో అనుమతులు పొందారు: తహసీల్దార్
- పోలీసులకు ఫిర్యాదు చేస్తానని వెల్లడి
- బషీర్‌మియా తండాలోనూ ఇదే పరిస్థితి



ఖానాపూర్‌లో 15 రోజుల క్రితం పూర్తయిన సీసీ రోడ్డు

తాండూరు రూరల్: ముఖ్యమంత్రి సొంత జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. కొంత మంది అక్రమార్కులు తప్పుడు సమాచారంతో అనుమతులు పొంది రెవెన్యూ అధికారులను బురిడీ కొట్టించారు. ఆరు ట్రాక్టర్లతో 40 ట్రిప్పుల ఇసుక రవాణాకు పర్మిషన్ తీసుకొని పెద్దేముల్ మండలం మంబాపూర్ సమీపంలో డంపింగ్ చేశారు. తప్పుడు ప్రొసీడింగ్ కాపీలు చూపి పర్మిషన్ పొందారని.. పోలీసులకు ఫిర్యాదు చేస్తానని తాండూరు తహసీల్దార్ చెప్పడం గమనార్హం. ఇసుక, మైనింగ్ అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేస్తున్నా తాండూరులో మాత్రం ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది.



బషీర్‌మియా తండాలో పాఠశాల పేరిట అనుమతి పొంది ఓ వ్యక్తి ఇంటి వద్ద ఇసుక డంపింగ్

పూర్తయిన సీసీ రోడ్డు పేరిట..

పెద్దేముల్ మండలం ఖానాపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎన్‌ఆర్ ఈజీఎస్ కింద రూ.4 లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన పనులకు పంచాయతీ రాజ్ అధికారులు అనుమతులు కూడా ఇచ్చారు. 15 రోజుల క్రితం రోడ్డు పనులు కూడా పూర్తయ్యాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. నాలుగు రోజుల క్రితం మంబాపూర్ గ్రామానికి చెందిన ద్యావరి గోపాల్‌రెడ్డి అనే వ్యక్తి (తప్పుడు ప్రొసీడింగ్ కాపీలతో) ఖానాపూర్‌లో సీసీ రోడ్డు పనులకు ఇసుక కావాలని తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. తహసీల్దార్ తారాసింగ్.. గోపాల్‌రెడ్డి తోపాటు గ్రామానికి చెందిన శివ, రమేష్, మహేష్, వెంకట్‌రాజు ట్రాక్టర్లకు పర్మిషన్ ఇచ్చారు. వీటి ద్వారా రెండు రోజుల్లో (సోమ, మంగళవారాల్లో) 30 ట్రిప్పుల ఇసుకకు అనుమతులు ఇచ్చారు. ఐదు ట్రాక్టర్ల ద్వారా మంబాపూర్‌లో ఇసుకను డంపింగ్ చేస్తున్నట్లు తెలిసింది.

పాఠశాల కోసం..

ఇదిలా ఉండగా యాలాల మండలం బషీర్‌మియా తండాలోని ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్ల నిర్మాణం కోసం ఇసుక అవసరం అని ఖాంజాపూర్‌కు చెందిన వెంకటయ్య దరఖాస్తు చేసుకున్నాడు. సోమ, మంగళవారాల్లో 10 ట్రాక్టర్ల ఇసుకకు తహసీల్దార్ పర్మిషన్ ఇచ్చారు. అయితే ఆ పాఠశాలలో ఎలాంటి నిర్మాణాలు జరగడం లేదని ఉపాధ్యాయులు తెలిపారు. అక్రమంగా అనుమతులు పొంది తండాలోని ప్రైవేట్ వ్యక్తులకు ఇసుక విక్రయించినట్లు తెలిసింది. ఈ విషయమై తహసీల్దార్‌కు ఫిర్యాదులు అందాయి.

వెలుగులోకి వచ్చింది ఇలా..



మంబాపూర్‌కు అక్రమంగా ఇసుక తరలింపు

తాండూరు మండలం ఖాంజాపూర్ వాగు నుంచి పెద్దేముల్ మండలం ఖానాపూర్‌లో సీసీ రోడ్డు పనులకు వెళ్లాల్సిన ఇసుక ట్రాక్టర్లు మంబాపూర్ వైపు వెళ్లడాన్ని స్థానికులు గుర్తించారు. ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తెచ్చారు. దీంతో అసలు విషయం బయట పడింది. నంబరు ప్లేట్లు లేని ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. బషీర్‌మియా తండాలో కూడా ఇసుకను అక్రమంగా అమ్ముకుంటున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. పాత ప్రొసీడింగ్ కాపీలకు ఇసుక పర్మిషన్లు ఇచ్చారనే విషయం తాండూరులో చర్చనీయంశంగా మారింది.

పోలీసులకు ఫిర్యాదు చేస్తా



పెద్దేముల్ మండలం ఖానాపూర్‌లో సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయని ఇసుక అవసరం అని మంబాపూర్‌కు చెందిన గోపాల్‌రెడ్డి అనే వ్యక్తి తప్పుడు ప్రొసీడింగ్‌లతో దరఖాస్తు చేసుకున్నాడు. రోడ్డు పనులు పూర్తయిన విషయం తెలియక ఇసుక రవాణాకు పర్మిషన్ ఇచ్చా. స్థానికుల ద్వారా అసలు విషయం తెలిసింది. మంబాపూర్‌లో ఇసుక డంపింగ్ చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తా.

– తారాసింగ్, తహసీల్దార్, తాండూరు మండలం

‘పవర్’ఫుల్!

- 11 కేవీ ఫీడర్లపై ఆన్‌లైన్ మానిటరింగ్
- కోతలు, సరఫరాలో హెచ్చుతగ్గుల గుర్తింపు కోసం ప్రత్యేక టెక్నాలజీ
- ఫీడర్ ఔటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టం ఏర్పాటుతో సమస్యలకు చెక్
- ఈనెల చివరి నాటికి రెండువేల ఫీడర్ల పరిధిలో అమలుకు సన్నాహాలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు.. హెచ్చుతగ్గుల సమస్య తక్షణ గుర్తింపు.. పరిష్కారం కోసం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెస్తోంది. ఇప్పటికే లైన్ టు లైన్, పోల్ టు పోల్ తిరిగి అధిక ఒత్తిడికి గురవుతున్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, దెబ్బతిన్న ఇన్సులేటర్లు, ఫ్యూజ్ బాక్స్‌లు, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలు, లూజు లైన్లను గుర్తించి వాటిని ‘సాసా’వెబ్ పోర్టల్‌లో పొందుపరిచిన డిస్కం.. తాజాగా 11 కేవీ ఫీడర్ల రియల్ మానిటరింగ్ కోసం ‘ఫీడర్ ఔటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టం’ (ఎఫ్‌ఓఎంఎస్)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. తద్వారా ఏ ఫీడర్‌పై ఎంత ఒత్తిడి ఉంది.. ఏరోజు, ఎన్ని నిమిషాల పాటు సరఫరా నిలిచిపోయింది.. ఎంత సమయంలో సరఫరా పునరుద్ధరించారు.. వంటి పూర్తి సమాచారం ఆన్‌లైన్‌లో నిక్షిప్తమవుతుంది. డిస్కం కేంద్ర కార్యాలయంలోని ఉన్నతాధికారులతో పాటు క్షేత్రస్థాయిలోని ఏఈల మొబైల్ ఫోన్లకు ఈ సమాచారం వెళ్లిపోతుంది. దీంతో లైన్ల నిర్వహణ, పునరుద్ధరణ పేరుతో క్షేత్రస్థాయి ఇంజనీర్లు అడ్డగోలుగా అమలు చేస్తున్న ఎల్సీలకు చెక్ పడనుంది. అంతేకాదు ఫీడర్లపై పడుతున్న ఒత్తిడిని కూడా ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుంది. అధిక ఒత్తిడి కారణంగా ఫీడర్లలో సమస్యలు తలెత్తకుండా ముందే జాగ్రత్తపడేందుకు ఈ సాంకేతిక పరిజ్ఞానం తోడ్పతుంది.

అంతరాయాలకు ఆస్కారం లేకుండా..

జీహెచ్‌ఎంసీ పరిధిలో 11 కేవీ ఫీడర్లు 3,412 వరకు ఉన్నాయి. ఒక్కో ఫీడర్ కొన్ని కిలోమీటర్లు విస్తరించి ఉంటుంది. ఫీడర్‌పై 25 నుంచి 50 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటాయి. ఒక్కో డీటీఆర్ పరిధిలో 50 విద్యుత్ కనెక్షన్లు ఉంటాయి. మెజార్టీ గృహ యజమానులు విద్యుత్ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకునే సమయంలో ఒక కిలోవాటు, రెండు కిలోవాట్లకే పరిమితం అవుతుంటారు. ఆ తర్వాత ఏసీ, కూలర్లు, గ్రీజర్, రిఫ్రిజిరేటర్, మిక్సీ, టీవీ, ఫ్యాను.. ఇలా పదుల సంఖ్యలో ఎలక్ట్రికల్ వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. సామర్థ్యానికి మించి విద్యుత్‌ను వినియోగిస్తుండటంతో ఆ భారం సమీపంలోని డీటీఆర్, సబ్ స్టేషన్లలోని ఫీడర్లపై పడుతోంది. పగటి ఉష్ణోగ్రతలకు తోడు అధిక విద్యుత్ వినియోగంతో తరచూ ఫీడర్ ట్రిప్పవుతోంది. సరఫరాలో అంతరాయాలకు కారణమవుతోంది. ఎఫ్‌ఓఎంఎస్ సాంకేతిక పరిజ్ఞానం అనుసంధానంతో ఫీడర్‌పై భారం ముందే తెలిసిపోతుంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునే అవకాశం లభిస్తుంది. తొలి దశలో మార్చి చివరి నాటికి 2000 ఫీడర్ల పరిధిలో ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చాలని నిర్ణయించారు. ఆ తర్వాతి దశల్లో మిగిలిన ఫీడర్ల పరిధిలోనూ ఈ రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేయనున్నారు.

గ్రేటర్‌లో సర్కిళ్ల వారీగా ఉన్న ఫీడర్లు

సర్కిల్	11 కేవీ ఫీడర్లు
బంజారాహిల్స్	310
సైబర్‌సిటీ	437
హబ్సిగూడ	381
హైదరాబాద్ సెంట్రల్	307
హైదరాబాద్ సౌత్	323
మేడ్చల్	467
రాజేంద్రనగర్	588
సరూర్‌నగర్	330
సికింద్రాబాద్	269

వసతి‘గ్రహాలు’

సంక్షేమ హాస్టళ్లలో వేధింపులు, ఎలుకల బెడద



ఇటీవల నవాబుపేట కేజీబీవీలో ఎలుకలు కొరకడంతో గాయపడిన విద్యార్థులకు వైద్యం చేస్తున్న డాక్టర్

- తరచూ ఆస్పత్రుల పాలవుతున్న విద్యార్థులు
- పిల్లల విషయంలో తల్లిదండ్రుల ఆందోళన

వికారాబాద్: జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు సమస్యలు, వేధింపులకు కేంద్రాలుగా మారుతున్నాయి. హాస్టళ్లను ఉన్నతాధికారులు పర్యవేక్షించకపోవడంతో కొంత మంది సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఉపాధ్యాయుల వేధింపులు, ఫుడ్ పాయిజన్, ఎలుకలు కొరకడం వంటి వాటి కారణంగా విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేస్తే తప్ప ఇలాంటి విషయాలు బయటకు రావడం లేదు. జిల్లాస్థాయి అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమయ్యింది మొదలు ఏదో ఒక హాస్టల్‌లో, గురుకులంలో విద్యార్థులు అస్వస్థతకు గురవుతూనే ఉన్నారు. పరిస్థితి సీరియస్‌గా ఉన్నప్పుడు మాత్రమే అధికారులు హడావుడి చేసి ఆ తర్వాత వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ వసతి గృహాల్లో తరచూ ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకుంటుడంతో మూడు నెలల క్రితం కలెక్టర్ జిల్లా ఉన్నతాధికారులకు హాస్టళ్లు, స్కూళ్ల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఆయా శాఖల హెచ్‌ఓడీలు మండలాల ప్రత్యేకాధికారులుగా నియమించి వారంలో రెండు స్కూళ్లు, హాస్టళ్లను సందర్శించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయినా పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రావడం లేదు.

వారంలో రెండు ఘటనలు

నవాబుపేట కేజీబీవీలో 15 రోజుల క్రితం నలుగురు విద్యార్థులను ఎలుకలు కరిచాయి. మరో మూడు రోజుల వ్యవధిలో మరో నలుగురు ఎలుకలు బారిన పడి ఆస్పత్రి పాలయ్యారు. హాస్టల్ సిబ్బంది స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించి చేతులుదులుపుకొన్నారు. విషయం తల్లిదండ్రులకు తెలియడంతో వారు కేజీబీవీ సిబ్బందిని నిలదీశారు. ఆ తర్వాత ఎమ్మెల్యే, అధికారులు పాఠశాలను సందర్శించి ఇలాంటి ఘటనలు జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

- 15రోజుల క్రితం వికారాబాద్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థిని ఉపాధ్యాయుల వేధింపులు భరించలేక స్కూల్ భవనం పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. బాలికలకు కాలు విరిగింది. మెట్ల పైనుంచి జారి పడటంతో కాలు విరిగిందని అపద్దం చెప్పి బాలికను తల్లిదండ్రుల వెంట ఇంటికి పంపారు. విద్యార్థిని తల్లిదండ్రులకు అసలు విషయం చెప్పడంతో వారు పాఠశాల ముందు ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై హడావుడి చేసిన అధికారులు ఆ తర్వాత మిన్నకుండి పోయారు.
- ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని అధికారులు పదేపదే చెబుతున్నా అమలు కావడం లేదు. నాణ్యమైన సరుకులు, కూరగాయలు వాడకపోవడంతో విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురై ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఈ ఏడాది ఇలాంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.
- ఇటీవల చౌడాపూర్ మండలంలోని ఓ హాస్టల్ విద్యార్థులు మంచి భోజనం పెట్టాలని అడిగితే వార్డెన్ దుర్భాషలాడాలంటూ ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే.
- కుల్కచర్ల మండలంలోని ఓ హాస్టల్‌లో ఫుడ్‌పాయిజన్‌కు గురై పదుల సంఖ్యలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు.
- ఆ కొద్ది రోజులకే నస్కల్ కస్తూర్బా బాలికల పాఠశాలలో 26 మంది.. ఆ తర్వాత కొత్తగడి వసతి గృహం విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. బూర్గుపల్లి గురుకుల పాఠశాలలో కూడా ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది.
- ఆ వెంటనే అనంతగిరిపల్లి బాలుర వసతి గృహంలో విద్యార్థులు జాండీస్ బారిన పడ్డారు.
- తాండూరు బాలికల వసతి గృహంలో పదుల సంఖ్యలో విద్యార్థినులు ఆస్పత్రుల పాలయ్యారు. ఇలా నిత్యం ఏదో ఒక హాస్టల్‌లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తోంది.

పర్యవేక్షణ గాలికి..

జిల్లాలో సోషల్, బీసీ, ఎస్టీ, మైనార్టీ వెల్ఫేర్ సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. వీటితో పాటు స్త్రీ శిశుసంక్షేమం, గురుకుల, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు ఉన్నాయి. వీటిలో పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్ హాస్టళ్లు కలిపి ఒక్కో శాఖలో 20 నుంచి 25 వరకు ఉన్నాయి. మొత్తం వంద పైచిలుకు హాస్టళ్లు ఉన్నాయి. ఈ శాఖలకు సంబంధించి జిల్లా అధికారులు కూడా ఉన్నారు. అయితే మైనార్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఉద్యోగ విరమణ పొందగా ఆ బాధ్యతలు యువజన విభాగం మరియు క్రీడల శాఖ జిల్లా అధికారికి అప్పగించారు. ఇక గురుకులాల బాధ్యతలు ఆర్‌సీఓలకు అప్పగించారు. హాస్టళ్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సమస్యలు లేకుండా చూడాల్సిన అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం విద్యార్థులపై జరుగుతున్న వేధింపులను, ఇతర సమస్యలను పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్లుప్తంగా

తెలంగాణ పోలీస్ జట్టులో ఇప్పాయిపల్లివాసి



వేణుగోపాల్

కుల్కచర్ల: మండల పరిధిలోని ఇప్పాయిపల్లికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ వేణుగోపాల్ ఆల్ ఇండియా పోలీస్ వాలీబాల్ క్లస్టర్ పోటీల్లో సత్తాచాటుతున్నాడు. ప్రస్తుతం హర్యానాలో జరుగుతున్న పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇదిలా ఉండగా వేణుగోపాల్ సైబరాబాద్ కమాండ్ కంట్రోల్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు.

అంగన్‌వాడీ టీచర్ మృతి


మృతురాలి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న సీడీపీఓ తదితరులు

కేశంపేట: అనారోగ్యంతో ఓ అంగన్‌వాడీ టీచర్ మృతి చెందింది. ఈ ఘటన అల్వాల అనుబంధ గ్రామం తులవానిగడ్డలో సోమవారం చోటు చేసుకుంది. ఆమె మరణ వార్త తెలుసుకున్న మాజీ ఎంపీపీ ఎల్గమోని రవీందర్‌యాదవ్, ఐసీడీఎస్ సీడీపీఓ షబనాహుస్సేన్, ఐసీడీఎస్ మాజీ సీడీపీఓ నాగమణి, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, శమంతకమణి , పలువురు అంగన్‌వాడీ టీచర్లు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆమె భౌతిక కాయానికి నివాళి అర్పించారు. అనంతరం అంత్యక్రియలకు ప్రభుత్వం అందించే ఆర్థికసాయం చెక్కును మృతురాలి కుటుంబ సభ్యులకు సీడీపీఓ అందజేశారు.

రికవరీ ఫోన్ల అప్పగింత


సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఎస్‌ఐ అనిత

ధారూరు: మండల పరిధిలోని వివిధ గ్రామాలు, తండాల్లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బాధితులకు తొమ్మిది సెల్‌ఫోన్లను అప్పగించినట్లు ఎస్‌ఐ అనిత తెలిపారు.

నాలుగు టిప్పర్లు, జేసీబీ సీజ్

కడ్తాల్: నిబంధనలకు విరుద్ధంగా మట్టితరలిస్తుండగా పోలీసులు దాడులు చేపట్టి వాహనాలను సీజ్ చేశారు. ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి సమీపంలోని సర్వేనంబర్ 321/1లో ఉన్న ప్రభుత్వ భూమి నుంచి మట్టి తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేసి నాలుగు టిప్పర్లు, ఓ జేసీబీని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు జేసీబీ, టిప్పర్ డ్రైవర్లతో పాటు ఆయా వాహనాల యజమానులు మునావత్ శ్రీను (గానుగుమార్లతండా), నేనావత్ శ్రీను(పుల్లేరుబోడ్ తండా)పై కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

వరద కాల్వను పూడుస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

మొయినాబాద్: మున్సిపల్ పరిధిలోని సురంగల్ పెద్ద చెరువులోకి వచ్చే వరద కాల్వను పూడుస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని సురంగల్‌కు చెందిన గడ్డం వెంకట్‌రెడ్డి తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన సోమవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సురంగల్‌లోని పెద్ద చెరువులోకి కనకమామిడి వైపు నుంచి వరద కాల్వ వస్తుందని.. నజీబ్‌నగర్ రెవెన్యూలోని సర్వే నెంబర్ 73, 74 వద్ద న్యాయవాది వలీ వరదకాల్వను పూర్తిగా పూడ్చివేసి తన పొలంలో కలుపుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే చర్యలు తీసుకుని కాలువ పూడ్చివేయడాన్ని అడ్డుకోవాలని కోరారు.

ప్రియుడితో వెళ్లిపోయిన నవవధువు!

మణికొండ: వివాహం అయిన ఏడు రోజులకే ఓ నవవధువు మాజీ ప్రియుడితో వెళ్లిపోయిన ఉదంతం నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాళీమందిర్ వద్ద మూడు రోజుల క్రితం జరిగింది. అతని చర్యను తను నివసిస్తున్న బస్తీవాసులే వ్యతిరేకించి, అతని ఫొటోకు చెప్పుల దండ వేసి ఊరేగించిన సంఘటన సోమవారం లంగర్‌హౌస్‌లో కలకలం సృష్టించింది. వివరాలివీ... నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాళీ మందిర్ వద్ద నివసిస్తున్న ఓ యువతి గతంలో లంగర్‌హౌస్‌లో నివసించే అరవింద్ అనే యువకుడిని ప్రేమించింది. తల్లితండ్రులు ఏడు రోజుల క్రితం ఆమెకు అత్తాపూర్‌కు చెందిన ఓ యువకుడితో వివాహం చేశారు. ప్రియుడితో కొనసాగిన ప్రేమాయణంతో ఆమె మూడు రోజుల క్రితం అతని వెంట వెళ్లిపోయింది. దాంతో తల్లిదండ్రులు నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో తమ కూతురు కనిపించటం లేదని ఫిర్యాదు చేశారు. అది విచారణ కొనసాగుతున్న క్రమంలోనే సోమవారం విషయం లంగర్‌హౌస్‌లోని అతని బస్తీలో తెలిసింది. దాంతో స్థానికులు అతను చేసిన చర్యను తీవ్రంగా వ్యతిరేకించారు. బస్తీలో అతని ఫొటోకు చెప్పుల దండ వేసి ఊరేగించారు.

మహిళా సంఘాల ఎన్నికల సందడి


అంతారం నూతన సంఘం అధ్యక్షులుగా ఎంపికైన వారిని సన్మానిస్తున్న అధికారులు, సంఘ సభ్యులు

కోలాహలంగా గ్రామ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ

- అమ్మ ఆదర్శ కమిటీ ఛైర్మన్ల బాధ్యత నేపథ్యంలో పెరిగిన పోటీ
- బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహిస్తున్న సెర్ప్ అధికారులు

కుల్కచర్ల: పొదుపు సంఘాల పర్యవేక్షణకు బాధ్యత వహించే గ్రామ పొదుపు సంఘాల ఎన్నికలతో గ్రామాల్లో కోలాహలం నెలకొంది. బ్యాలెట్ విధానంలో నిర్వహిస్తున్న ఈ ఎన్నికలు ఆసక్తికరంగా కొనసాగుతున్నాయి. మండల పరిధిలో 37 పంచాయతీలుండగా 30 గ్రామ సంఘాలున్నాయి. చౌడాపూర్ మండల పరిధిలో 24 గ్రామాలకుగాను 17 గ్రామ సంఘాలున్నాయి. ఒక్కో గ్రామానికి ఒక మహిళా అధ్యక్షురాలు ఉంటారు. వీరు గ్రామ సంఘం పరిధిలోని పొదుపు సంఘాలకు బాధ్యత వహిస్తారు.

పెరిగిన పోటీ

గతంలో గ్రామ కమిటీ అధ్యక్షులుగా పోటీ చేసేందుకు మహిళలు పెద్దగా ఆసక్తిచూపేవారు కాదు. ప్రస్తుతం గ్రామ సంఘం అధ్యక్షులకు అమ్మ ఆదర్శ కమిటీ ఛైర్‌పర్సన్‌లుగా అవకాశం కల్పిస్తున్న నేపథ్యంలో అవగాహన ఉన్న స్థానిక నాయకులు తమ భార్యలను గ్రామ సంఘం అధ్యక్షులుగా ఎంపికయ్యేలా చూసుకుంటున్నారు. నాయకత్వ లక్షణాలు ఉన్న మహిళలు సైతం ఛైర్‌పర్సన్‌లుగా ఎంపికయ్యేందుకు ఆసక్తి చూపుతున్నారు. గ్రామ పరిధిలో


కుల్కచర్ల మహిళా సమాఖ్య భవనం

ఉన్న ప్రభుత్వ పాఠశాలలలో అభివృద్ధి పనులు నిర్వహించేందుకు వీరికే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ అధ్యక్ష ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపించేలా ఉన్నాయి.

ఎన్నిక ప్రక్రియ

పొదుపు సంఘాలలో ఉన్న సభ్యులు తమ గ్రామ సంఘానికి ప్రాతినిధ్యం వహించేందుకు ఎన్నికల విధానంలో ముందుకువెళ్లాల్సి ఉంటుంది. ఒక గ్రామంలో ఉన్న పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలు తమ పొదుపు సంఘం నుంచి ఎన్నికవ్వాలి. అనంతరం తమ పరిధిలో ఉన్న పొదుపు సంఘాలతో పోటీ పడి 30మంది రిప్రజెంటివ్ జనరల్ బాడీ కమిటీ సభ్యులుగా ఎంపికవ్వాలి. అనంతరం 15 మంది ఎగ్జిగ్యూటీవ్ కమిటీ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. వీరికి ఓటింగ్ సిస్టంలో ఎన్నికలు నిర్వహించి గ్రామ సంఘం అధ్యక్షులుగా, కార్యదర్శిగా, ఉపాధ్యక్షులుగా, సహాయకార్యదర్శిగా, కోశాధికారిగా ఐదుగురి కమిటీని ఎంపిక చేసి ప్రక్రియను పూర్తిచేస్తారు చురుకుగా ఉన్న సంఘం సభ్యులకు, సంఘం వాటధనం, రీపేమెంట్ యాక్టీవ్‌గా చేసే సంఘం సభ్యులకు తదితర కొన్ని నిబంధనలతో సంఘం ఎన్నికలు కోలాహలంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 14 వరకు గ్రామ సంఘం అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ పూర్తికానుంది.

14 లోగా పూర్తి



గ్రామాల్లో సీసీల ఆధ్వర్యంలో గ్రామ సంఘం ఎన్నికలు నిర్వహించడం జరుగుతుంది. కొత్త నిబంధనలను అనుసరించి ఓటింగ్ పద్ధతిని అవలంబిస్తూ ఎన్నికలు కొనసాగుతున్నాయి. మొదటగా గ్రామ సంఘాల ఎన్నికలు నిర్వహించి అనంతరం మండల సమాఖ్య అధ్యక్షురాలి ఎన్నిక నిర్వహించడం జరుగుతుంది. ఈ నెల 14లోపు గ్రామ సంఘాల అధ్యక్షుల ఎంపిక ప్రక్రియను పూర్తిచేస్తాం.

– శోభ, ఏపీఎం, కుల్కచర్ల

మహిళా శక్తి సృష్టిలోనే గొప్పది

తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి


సన్మానం అందుకున్న మహిళలతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు టౌన్: సృష్టిలోనే మహిళా శక్తి గొప్పదని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్వీఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలు రంగాల్లో సేవలందిస్తున్న మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలకు అవకాశం కల్పిస్తే అద్భుతాలను సృష్టిస్తారన్నారు. మహిళలు గౌరవ మర్యాదలు అందుకునే చోట దేవతలు కొలువై ఉంటారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల కోసం ఉచిత ఆర్టీసీ ప్రయాణం, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల నిర్వహణ, ఇందిరా మహిళా శక్తి ద్వారా స్వయం సహాయక సంఘాలకు 150 అద్దె బస్సుల నిర్వహణ వంటి పథకాలు అమలు చేసిందన్నారు.

'317 జీఓ బాధితులకు న్యాయం చేయండి'

317 జీఓ బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వ మహిళా ఉద్యోగులు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డిని కోరారు. సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా వారు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 317 జీఓ పేరిట పలు విభాగాల్లో ఉద్యోగులు రాత్రికిరాత్రే ఇళ్లు, పిల్లలను వదిలి ఇతర జిల్లాలకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని జీఓ రద్దు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

కారు, ఆటో ఢీ..

ముగ్గురికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

ఇబ్రహీంపట్నం: ఓ కారు, గూడ్స్ ఆటో ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్‌ఐ నాగరాజు తెలిపిన ప్రకారం.. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిలో గురునానక్ విద్యాసంస్థల సమీపంలో ఎదురెదురుగా ప్రయాణిస్తున్న ఓ ఆల్టోకారు, టాటాఏస్ గూడ్స్ వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో ఉన్న ఇద్దరు, ఆల్టోకారులో ప్రయాణిస్తున్న కానిస్టేబుల్ మహేశ్వర్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందకపోవడంతో పూర్తి వివరాలు తెలియరాలేదని పోలీసులు చెప్పారు.

హెడ్‌కానిస్టేబుల్ మృతి

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు


రాంచందర్‌రావు (ఫైల్)


గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

తాండూరు రూరల్: గుండెపోటుతో ఓ హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందాడు. యాలాల మండలం జక్కెపల్లికి చెందిన రాంచందర్‌రావు(55) హెడ్ కానిస్టేబుల్. ఆయన మండలంలోని గౌతపూర్ సమీపంలోని రూరల్ సీఐ కార్యాలయంలో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. భార్యాపిల్లలతో కలిసి పట్టణంలోని వెంకటేశ్వరకాలనీలో నివాసముంటున్నారు. నెల రోజుల క్రితం రాంచందర్‌రావుకు గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. సోమవారం ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుండెపోటు వచ్చి మృతి చెందారు. 1990 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ రాంచందర్‌రావు అందరితో కలివిడిగా ఉండేవాడని పోలీసులు గుర్తు చేసుకున్నారు. రాంచందర్‌రావు మృతిపై డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, పట్టణ, రూరల్ సీఐలు సంతోష్, నగేష్, ఎస్‌ఐ, కానిస్టేబుళ్లు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

రోడ్డు మంజూరుకు నిధులు కేటాయించండి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బొక్క నర్సింహారెడ్డి

కేశంపేట: మహేశ్వరం మండల పరిధిలోని పెద్ద గోల్కొండ (ఓఆర్ఆర్ ఎగ్జిట్) నుంచి మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ వరకు డబుల్ బీటీ రోడ్డు మంజూరు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. ఇదే విషయంపై ఆయన మంగళవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డితో కలిసి వినతిపత్రం అందజేశారు. పెద్దగోల్కొండ నుంచి కల్వకోలు వరకు రోడ్డు నిర్మాణం పూర్తయిందని, దానికి అనుసంధానంగా కల్వకోలు నుంచి మిడ్జిల్ వరకు డబుల్ బీటీ రోడ్డును నిర్మించాలని కోరారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే శ్రీశైలం, బెంగుళూరు హైవేలకు సమాంతరంగా ప్రత్యామ్నాయ రోడ్డు అవుతుందన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే తిరుపతి వెళ్లే ప్రయాణికులకు 130 కిలో మీటర్ల ప్రయాణ దూరం తగ్గుతుందని ఆయన కేంద్రమంత్రికి వివరించారు. రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల ప్రజలకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఇందుకు స్పందించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీతో మాట్లాడారు. రోడ్డు నిర్మాణానికి కేంద్రమంత్రులు సానుకూలంగా స్పందించినట్లు నర్సింహారెడ్డి తెలిపారు.

విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలి

ఎస్‌ఎఫ్‌ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్


చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

చేవెళ్ల: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం వారు చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే వేలాది మంది విద్యార్థులతో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సమీర్, చరణ్‌గౌడ్, చందు, చారి, వినీత్, ఆదిత్య, విష్ణుగుప్తా, ఇర్ఫాన్, వివేకానంద, శశి, ఆకాశ్, షోఫాయాన్, విష్ణు, శివ, నవీన్, కార్తీక్, మైపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

బర్డ్‌ఫ్లూ కాదు.. కొక్కెర!

- నానక్‌నగర్ ఘటనపై స్పందించిన పశుసంవర్ధక శాఖ
- కోళ్లు అనారోగ్యానికి గురైతే సమాచారం ఇవ్వాలి
- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ విజయకుమార్‌రెడ్డి

యాచారం: వైరస్ కారణంగా కోళ్లు అనారోగ్యానికి గురైనా.. మృతి చెందినా వెంటనే మండల పశువైద్యాధికారులకు సమాచారం ఇవ్వాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. పది రోజుల క్రితమే అన్ని పౌల్ట్రీ ఫాంలలో పెంచుతున్న కోళ్లను పరీక్షించామన్నారు. నిత్యం పది నుంచి 20 కోళ్లు మృత్యువాత పడుతుంటాయన్నారు. మండల పరిధిలోని నానక్‌నగర్‌లో ఐదు రోజుల్లేనే 19 వేల కోళ్లు మృతి చెందడం ఆందోళన కలిగించే విషయమన్నారు. నానక్‌నగర్‌లో కోళ్ల మృతి చెందిన విషయమై ఆలస్యంగా సమాచారం అందడంతో సిబ్బంది వెళ్లలేకపోయారని.. వారు అక్కడకు వెళ్లేవరకు కోళ్ల కలేబరాలను పూడ్చేశారన్నారు. వ్యాధి నిర్ధారణ కోసం శాంపిల్స్‌ను భోపాల్‌కు పంపాల్సి ఉంటుందని తెలిపారు. సరైన సమయంలో వ్యాక్సిన్ అందించకపోవడంతో కోళ్లకు కొక్కెర అనే సోకే అవకాశం ఉంటుందని తెలిపారు. కొక్కెర వ్యాధితోనూ కోళ్లు రోజుల వ్యవధిలోనే వేలాదిగా మృతి చెందే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ వ్యాధి సోకి కోళ్లు మృతి చెందితే కిలోమీటర్ వరకు ప్రభావం ఉంటుందని తెలిపారు. నానక్‌నగర్ కోళ్లు మృతి చెందిన పౌల్ట్రీఫాం షెడ్లకు కిలోమీటర్ దూరం లోపు పౌల్ట్రీఫాంలు లేవని సిబ్బంది సమాచారం ఇచ్చారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా మరోమారు తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలని పశువైద్యాధికారులను ఆదేశించామన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి రూ.340 కోట్లు

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: నియోజకవర్గ పరిధిలో రూ.340 కోట్ల నిధులతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన చేయనున్నట్లు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పరిగి పట్టణ కేంద్రం నుంచి అన్ని ప్రాంతాలకు నాలుగు లేన్ల రహదారి నిర్మించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. మొదట పరిగి నుంచి వికారాబాద్ నాలుగులేన్ల రోడ్డు నిర్మాణానికి రూ.120 కోట్లు, పరిగి–షాద్‌నగర్‌కు రూ.120 కోట్లు, గడిసింగాపూర్ –రంగారెడ్డిపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.వంద కోట్లు మంజూరయ్యాయని వివరించారు. అనంతరం పట్టణ కేంద్రంలోని నంబర్–1 ఉన్నత పాఠశాల ఆవరణలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ఇందిరమ్మ కమిటీ సభ్యులు తప్పక హాజరు కావాలని సూచించారు. అనంతరం రూ.29 లక్షలతో పట్టణ కేంద్రంలోని కొత్తకుంట చెరువు పునఃనిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ పరశురాంరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ వెంకటయ్య, వైస్ ఛైర్మన్ అయూబ్, నాయకులు రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

పట్టణంలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం నిర్వహించిన లక్ష తులసీ అర్చన, చండీహోమం, మహా పూర్ణాహుతిలో ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పరిగి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ ఛైర్మన్లు పరుశురాంరెడ్డి, ఆంజనేయులు ముదిరాజ్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి

అనంతగిరి: వికారాబాద్‌కు సమీపంలోని అనంతగిరి అడవుల్లో సోమవారం వీధి కుక్కల దాడిలో ఓ జింక(దుప్పి) మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. ఉదయం అడవిలో సంచరిస్తున్న జింక(దుప్పి)పై ఒక్కసారిగా వీధి కుక్కలు దాడి చేశాయి. గమనించిన పలువురు వాటిని చెదరగొట్టారు. అనంతరం అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. వారు వచ్చేలోపు జింక మృతి చెందింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పరిగి: ఎదురుగా వస్తున్న బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని తొండుపల్లి గ్రామ సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శివశంకర్, రాము తొండుపల్లి నుంచి లాల్‌పహాడ్‌కు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నగరానికి తరలించారు. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు.

యువకుడి అదృశ్యం


మధు (ఫైల్)

కేశంపేట: కుటుంబ సభ్యులతో గొడవపడిన యువకుడు అదృశ్యమైన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, సీఐ నరహరి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దిని మధు(25) చదువుకుంటూ గ్రామంలో తల్లిదండ్రులతో ఉంటున్నాడు. జనవరి 3న డబ్బు కోసం కుటుంబ సభ్యులతో గొడవపడిన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గతంలోనూ పలుమార్లు గొడవ పెట్టుకుని వెళ్లి తిరిగి వచ్చేవాడు. ఈ క్రమంలో ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుని వెళ్లిన మధు కోసం కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం తల్లి పద్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి నుంచి వెళ్లిన నాడు జీన్స్ ప్యాంట్, బ్లూ ఫుల్ హ్యాండ్స్ టీషర్ట్ ధరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

- డిజిటల్ లావాదేవీలే సురక్షితం
- రిజర్వ్ బ్యాంకు అధికారి రెహమాన్


నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పిస్తున్న రిజర్వ్‌బ్యాంకు అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: శాస్త్ర సాంకేతిక రంగాలను ఉపయోగించుకుని బ్యాంకు లావాదేవీలను కొనసాగించాలని రిజర్వ్ బ్యాంకు అధికారి రెహమాన్ అన్నారు. మార్చి 10 నుంచి 16 వరకు డిజిటల్ అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని ఎల్మినేడు ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ పేమెంట్స్‌పై అవగహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రిజర్వ్ బ్యాంకు అధికారులు ఎ.సావిత్రి, ఎ.రెహమాన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిజిటల్ టెక్నాలజీని సురక్షితంగా వినియోగించుకోవాలని సూచించారు. థర్డ్ పార్టీ యాప్‌ల జోలికి పోకుండా నేరుగా బ్యాంకులు సూచించిన యాప్‌ల సహకారంతోనే లావాదేవిలు కొనసాగించాలని చెప్పారు. ఆర్థిక అక్షరాస్యతపై అందరికి అవగహన అవసరమన్నారు. నగదు రహిత లావాదేవిలు చేసే సమయంలో సైబర్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని వివరించారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల అధికారులు డిజిటల్ పేమెంట్స్‌పై ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు సీనియర్ బిజినెస్ మేనేజర్ ఎం.మురళీకృష్ణ, కె.సుధాకర్, బ్యాంక్ మేనేజర్ శిరీష్‌చంద్ర, ఎస్.నవీన్‌కుమార్, అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

నిజాయతీ చాటిన ఆర్టీసీ ఉద్యోగులు


బ్యాగును అందజేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

పరిగి: బస్సులో మరచిపోయిన బ్యాగును తిరిగి అప్పగించి నిజాయతీ చాటుకున్నారు పరిగి ఆర్టీసీ ఉద్యోగులు. ఈనెల 7వ తేదీన రాత్రి పరిగి నుంచి హైదారాబాద్‌కు ఆర్టీసీ బస్సు బయలు దేరింది. అందులో దినేష్ జైన్ అనే ప్రయాణికుడు తన బ్యాగును మరిచి మొయినాబాద్‌లో దిగిపోయాడు. దీంతో కండక్టర్ వెంకటయ్య, డ్రైవర్ సుధాకర్‌లు బ్యాగును గమనించగా.. అందులో రూ.లక్ష నగదు ఇతర పేపర్లు ఉండటంతో ఎంజీబీఎస్‌లో ఆర్టీసీ అధికారులకు అందజేశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు విచారించిన అధికారులు పోలీసుల సమక్షంలో బాధితుడికి నగదుతో ఉన్న బ్యాగును సోమవారం అందజేశారు. విధుల్లో నిజాయతీని చాటుకున్న ఉద్యోగులను డీఎం కరుణశ్రీ అభినందించారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

రెండు ఇళ్లలో చోరీకి విఫలయత్నం


దుండగుడు ధ్వంసం చేసిన బీరువాలు

షాద్‌నగర్ రూరల్: పట్టణ శివారు కాలనీల్లో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని గుర్తు తెలియని దుండగులు రెచ్చిపోతున్నారు. ఈ క్రమంలో సోమవారం పట్టణంలోని తిరుమల మెగా టౌన్‌షిప్ కాలనీలో రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన ప్రకారం.. తిరుమల మెగాటౌన్‌షిప్ కాలనీలో నివాసముండే రాజేష్, ఝాన్సీ దంపతులు ప్రభుత్వ ఉపాధ్యాయులు, కనకయ్య దంపతులు ప్రైవేటు ఉద్యోగస్తులు. ఉదయం వారు ఇళ్లకు తాళం వేసి తమతమ విధులకు వెళ్లిపోయారు. గమనించిన దుండగులు రాజేశ్ ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని వస్తువులు చిందరవందర చేశాడు. ఏమీ దొరక్కపోవడంతో పక్కనే ఉన్న కనకయ్య ఇంట్లోకి ప్రవేశించేందుకు యత్నింగా శబ్దంరావడంతో చుట్టుపక్కల ఇళ్ల వారు అక్కడకు వెళ్లే వరకే దుండగుడు పరారయ్యాడు. విధుల నుంచి వచ్చిన రాజేశ్ దంపతులు తాళం పగులగొట్టి ఉండడంతో డయల్ 100 నంబర్‌కు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరకుని సీసీ పుటేజీలు పరిశీలించారు. రాజేశ్, కనకయ్య ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుడు ఒకడే అని గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.